



దుర్గమ్మకు వెండి పాదాలు, హస్తాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు గుంటూరుకు చెందిన దవులూరు వెంకట మనోజ్ కుటుంబం శనివారం వెండి పాదాలు. హస్తాలను కానుకగా సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3711 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 759 విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

5న జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్



వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు పల్నాడు జిల్లా దూరవిద్య అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దూరవిద్య ఏసీడీసీ కె.ఎండీ. హుస్సేన్, ఏఐ కోఆర్డినేటర్లు కేవీ సుబ్బారెడ్డి, యు.వెంకటేశ్వరరావు, పి. ప్రభాకరరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ చదువు మళ్లీ కొనసాగిద్దాం, బంగారు భవిష్యత్ నిర్మించుకుందాం అని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు కళాశాలలో సంప్రదించాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన మహిళలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో కలెక్టర్ శివశంకర్ పర్యటన



రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, వడ్ల మూడివారిపాలెం, మునమాక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శనివారం పర్యటించారు. ఈ గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు పరిశీలించి తొలగించిన ఓటర్ల జాబితాలపై పరిశీలన చేశారు. తొలగించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో స్వయంగా కలిసి వివరాలు సేకరించారు. అనంతరం మండల కేంద్రమైన రొంపిచర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓట్ల తొలగింపుపై వివరంగా విశదీకరించారు. ఫారమ్-7 పై బూత్ లెవెల్ అధికారులు నిర్వహించిన ఎంక్వైరీ రిపోర్ట్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేషిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ అంకారావు, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆర్ఐ సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రావు, ఆయా బూత్ లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి వ్రతానికి నేటి నుంచి దరఖాస్తుల జారీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఆదివారం నుంచి దరఖాస్తులు జారీ చేస్తామని ఈఓ భ్రమరాంబ తెలిపారు. మధ్యాహ్నం నుంచి మహా మండపం నాల్గో అంతస్తులోని ఫెస్టివల్ విభాగంలో ఈ దరఖాస్తులు లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు దరఖాస్తులకు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేసి ఆలయ అధికారులకు అందజేయాలని సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో 500మందిని అనుమతిస్తామన్నారు.

మనసంతా మహానేత



వేమూరు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, నాయకులు



రేపల్లెలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, నాయకులు

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి

- జిల్లా వ్యాప్తంగా అన్నదానాలు, రక్తదానాలు
- పేదలకు పండ్లు పంపిణీ

సాక్షి ప్రతినిధి, బాపట్ల : సంక్షేమ పాలనను అందించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు ఎప్పటికీ మరువరని పార్టీ నాయకులు పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షీరాభిషేకాలు, అన్నదానాలు, రక్తదానాలు నిర్వహించారు.

- వేమూరు రైల్వేగేటు వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంత్రి మేరుగ నాగార్జున పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనను గుర్తుచేశారు. కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయ్‌కుమార్, ఏడుకొండలు, మోహన్ పాల్గొన్నారు.
- రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పూలమాలలేసి నివాళులర్పించారు. అక్కడే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేపల్లె బస్టాండ్ సెంటర్‌తోపాటు, నగరం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బాపట్ల పట్టణంలోని డీఎం పల్లి, ప్యాడిసన్‌పేట, టీచర్స్ కాలనీలోని వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే కోన రఘుపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్లపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించడంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉద్దండరాయునిపాలెంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నందిగం సురేష్

- చీరాలలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ స్థానిక గడియారస్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.
- అద్దంకిలోని బంగ్లారోడ్, ఎన్టీఆర్ నగర్, భవానీ సెంటర్లలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కొరిశపాడు మండలం, మేదరమెట్లలో పాల్గొన్నారు.
- పర్చూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ పర్చూరు బొమ్మలసెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి బొమ్మలసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యద్దనపూడి, ఇంకొల్లులోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు.

వృత్తిదారులకు పీఎం విశ్వకర్మ యోజన ఉపయోగకరం

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంతో 18 రకాల సంప్రదాయ కుల, చేతి వృత్తిదారులకు ఉపయోగంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ఈనెల 17 నుంచి ప్రారంభమవుతుందన్నారు. చెప్పులు కుట్టుకునే వారు, కుమ్మర్లు, బట్టలు నేసేవారు, తాపీపని, బొమ్మలు తయారీ, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసే వారు ఈ పథకం కిందకి వస్తారన్నారు. 5 నుంచి 7 రోజులు బేసిక్ శిక్షణనిచ్చి గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ ఇస్తామన్నారు. తొలి విడత రుణం రూ.లక్ష 18 నెలల రీపేమెంట్, రెండో విడత రూ.2 లక్షలు 30 నెలలు రీపేమెంట్, ఈ మొత్తానికి ఏడాదికి 5 శాతం మాత్రమే వడ్డీ ఉంటుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారు, హస్త కళాకారులు, కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అర్హత. రిజిస్ట్రేషన్ల కోసం దగ్గర్లోని సీఎస్‌సీ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు అందరి సహకారం కావాలి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



గుంటూరువెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి అందరి సహకారం అవసరమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శనివారం స్థానిక ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ 17 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి స్థాయిలోనూ వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, క్రీడా శిక్షకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఈఓ శైలజ, స్టెప్ సీఈఓ పల్లవి, డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ విద్యను అందించండి

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

వినుకొండటౌన్: విద్యకు సాంకేతికతను జోడిస్తూ విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్న తరుణంలో చదువును నేర్పే గురువులు బెత్తం ఉపయోగించడంపై పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అసహనం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బ్రాహ్మణపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆయన పాఠశాల గదిలోకి ప్రవేశించగానే అక్కడ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడి చేతిలో బెత్తం ఉండటంతో అసహనం వ్యక్తం చేస్తూ ఆయనే స్వయంగా ఉపాధ్యాయుడి చేత బెత్తంతో కొట్టించుకోవడంతో అధికారులు నివ్వెరపోయారు. ఉపాధ్యాయులకు, అధికారులకు తనదైన శైలిలో క్లాస్ ఇచ్చారు. ప్రభుత్వం విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొస్తూ నాడు-నేడు పథకం కింద కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దామని, బైజ్యూస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో ఆన్‌లైన్ ద్వారా పాఠాలు, ట్యాబ్‌లు ఇచ్చామని, ఇక బెత్తాలతో పనేముందన్నారు. కొందరు అధికారుల తీరు వల్ల విద్యావ్యవస్థకు చెడు పేరు వస్తుందని అన్నారు.

విద్యార్థులకు జగనన్న దీవెనలు

- నిధులు విడుదల చేసిన సీఎం జగన్
- సర్వత్రా హర్షాతిరేకాలు



ఈ ఫొటోలోని విద్యార్థిని పేరు అనపర్తి పరిమళ. బాపట్ల పట్టణంలోని భావపురినగర్ కాలనీకి చెందిన ఈమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇంటర్ పూర్తయ్యాక తమ కుమార్తె చదువు నిలుపుదల చేద్దామని అనుకున్నారు. అప్పటికే జగనన్న విద్యా దీవెన ఈ విద్యార్థికి అందుతోంది, డిగ్రీ పూర్తి చేయిద్దామని బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేర్పించారు. ఏడాదికి రూ.20వేలు ఖర్చు అవుతుంది. వాటితో నోటు పుస్తకాలు యూనిఫామ్ పోటీ పరీక్ష పరీక్షల పుస్తకాలు కొనుగోలు చేసి చదువుతుంది. ఈ ఏడాది కూడా జగనన్న విద్యాదీవెన అందడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. జగనన్న సాయంతో చదువు పూర్తి చేస్తానని అంటుంది.



మహిళ కళాశాలలో విద్యార్థినులు

బాపట్లఅర్బన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. ఫీజులు చెల్లించలేక ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆగి పోకూడదని భావనతో జగనన్న విద్యా జీవన పథకాన్ని అమలు చేస్తోంది. అలాగే వివిధ కోర్సులు చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులందరికీ ఆహారం, హాస్టల్ ఇతర నిర్వహణ ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన పథకాన్ని కూడా అమలు చేస్తోంది. ఈ రెండు పథకాలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తుంది. దీనితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు డ్రాప్స్ లేకుండానే చదువుతున్నారు. మొదటి విడతగా ఈ ఏడాది మార్చి 19న జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా బాపట్ల నియోజకవర్గ పరిధిలో 3863 మంది విద్యార్థులకు రూ.3.35 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. మే 24 రెండో విడత 2874 మంది విద్యార్థులకు రూ.2.83 కోట్లు విడుదల చేసింది. తాజాగా ఆగస్టు 28న మూడో విడత కింద 3384 విద్యార్థులకు రూ.3కోట్లు జమ చేసింది. ఆయా నిధులు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమవుతున్నాయి.

జగనన్నకు కృతజ్ఞతలు



ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా దీవెన పథకంతో మాలాంటి ఎంతోమంది విద్యార్థులకు చేయూత లభిస్తుంది. బాపట్ల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. విద్యా దీవెన ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిది.

– కొకి భువనేశ్వరి, విద్యార్థిని దరివాదకొత్తపాలెం

జగనన్న భరోసాతోనే చదువుకుంటున్నా..



జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా నేను ప్రత్యేక లబ్ధి పొందుతున్నాను. ప్రస్తుతం బాపట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాను. విద్యా దీవెన మూడు విడతల్లో బ్యాంకు ఖాతాలో జమైంది.

–కృప వాత్సల్య, విద్యార్థిని బాపట్ల మహిళా డిగ్రీ కళాశాల

సక్రమంగా అందుతున్నాయి



జగనన్న విద్యా దీవెన నిధులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా మాకు అందుతున్నాయి. డిగ్రీలో పుస్తకాలు, యూనిఫామ్, దుస్తులు వంటివి కొనుగోలు చేసేందుకు ఇవి చాలా ఉపయోగపడ్డాయి. ఇంటి వద్ద తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు అభ్యసించేందుకు విద్యా దీవెన నిధులు ఆసరాగా నిలుస్తున్నాయి.

– ఎ.భారతీ కళ్యాణి, బీఎస్సీ విద్యార్థిని

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు

నరసరావుపేటరూరల్: ర్యాగింగ్ పెనుభూతం వంటిదని, దాని వలన చాలా దుష్పరిణామాలు ఉన్నాయని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆశీర్వాదం పాల్ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడిన కేసులో నిందితుడిగా ఉంటే ఉద్యోగాలకు అనర్హులవుతారని తెలిపారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటుచేయాలని సూచించారు. ర్యాగింగ్‌కు గురైన వారు అధ్యాపకులకు, డయల్ 100కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినులు దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.విజయకుమార్, ఎస్.ప్రసాదు, బి.శ్యామ్‌శంకర్, పారా లీగల్ వలంటీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్స్‌కు పటిష్ట భద్రత



ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బాపట్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోడౌన్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. హర్యానా నుంచి జిల్లాకు 4,620 వివిప్యాట్స్, కర్నాటక రాష్ట్రం బెంగళూరు నుంచి 4,200 సి.యు.యంత్రాలు జిల్లాకు వచ్చాయని తెలిపారు. రానున్న సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలననుసరించి అధికారులంతా పనిచేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాకు వచ్చిన యంత్రాలను పటిష్టమైన భద్రతతో గోదాములో ఉంచాలన్నారు. ప్రతి యంత్రం కోడ్ నెంబరును ఆన్‌లైన్‌లో పరిశీలించి కట్టుదట్టమైన భద్రతతో గోదాములు భద్రపరచాలన్నారు. ముఖ్యంగా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల సమక్షంలో వాటిని గోదాముల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, ఎన్నికల పర్యవేక్షకులు కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు





చోరీలకు పాల్పడిన నిందితులు

మేదరమెట్ల: పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కొరిశపాడు పోలీసుస్టేషన్‌లో పోలీసులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కర్నాటకకు చెందిన కొరవర హనుమంతప్ప, అదే రాష్ట్రంలో కనకగిరి గ్రామానికి చెందిన దారొజీ రాజా సాహెబ్ ఇద్దరు కలసి చోరీలకు పాల్పడుతుండేవారు. గత నెల 26వ తేదీన కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామంలో ఇంటికి తాళాలు వేసి కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలు దోచుకుపోయారు. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను స్థానిక ఫైలాన్ సమీపంలో అరెస్టు చేసినట్లు వీరి నుంచి రూ.1.5 లక్షల విలువగల బంగారు, వెండి ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిపారు. వీరు పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ కేసును వారం రోజుల్లోనే ఛేదించినందుకు చీరాల డీఎస్పీ ప్రసాదరావు, రూరల్ సీఐ ఆర్ ఉమేష్, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. కేసులో బాధితురాలైన పాతూరి లక్ష్మి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.

అధికార లాంఛనాలతో జవాను అంత్యక్రియలు

జే.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ నూతలపాటి సుధీర్ కుమార్ (38)కు అధికార లాంఛనాలతో శనివారం అత్యక్రియలు నిర్వహించారు. 2012లో సీఆర్‌పీఎఫ్ జవానుగా బాధ్యతలు తీసుకొని జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సెలవులపై ఇంటికి వచ్చి రెండు రోజులు క్రితం తన భార్య ఊరు గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు వెళ్లగా, అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు సుధీర్‌ను గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. సుధీర్ మృతదేహాన్ని శనివారం స్వగ్రామం అయిన అలవలపాడు తీసుకొచ్చారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సుధీర్ మృతదేహానికి అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు సుధీర్‌కు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలకు 47 మంది హాజరు

రేపల్లె: రాష్ట్రవ్యాప్తంగా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైప్‌రైటింగ్ పరీక్షలు రేపల్లె పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తుండగా రేపల్లెలో ఒక సెంటరులో పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. జూనియర్ గ్రేడ్‌కు నలుగురు, ఇంగ్లీష్ లోయర్ గ్రేడ్‌కు 31 మంది, హయ్యర్ గ్రేడ్‌కు 11, తెలుగు టైప్ రైటింగ్ హైయర్ గ్రేడ్‌కు ఒక్కరు మొత్తం 47 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చీరాల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి చీరాల - ఒంగోలు బైపాస్ రోడ్డులోని మన్నం అపార్టుమెంట్ వద్ద చోటుచేసుకుంది. వేటపాలెం మండలం సమైక్యనగర్‌కు చెందిన యలవర్తి క్రాంతి (30) ద్విచక్రవాహనంపై చీరాల నుంచి వేటపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్వాక్రా రుణాల గోల్‌మాల్‌పై విచారణ

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న మెప్మా పీడీ వెంకట నారాయణ



రికార్డులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ వెంకట నారాయణ

రేపల్లె రూరల్: డ్వాక్రా మహిళల పేర్లతో అక్రమంగా రుణాలు పొందిన ఆర్‌పీలు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ చెప్పారు. పట్టణంలోని 21వ వార్డుతో పాటు పలు వార్డుల్లో డ్వాక్రా మహిళలకు తెలియకుండానే వారి పేర్లతో పలు బ్యాంక్‌ల్లో రూ.లక్షలు రుణాలు పొందినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో శనివారం రేపల్లె మెప్మా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో ఉన్న డ్వాక్రా గ్రూపులు వారు బ్యాంకుల వారీగా పొందిన రుణాల జాబితాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. అత్యధికంగా 21వ వార్డులో ఆర్‌పీ ఆ గ్రూపు సభ్యులకు తెలియకుండానే రుణాలు పొందినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామన్నారు. పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయటంతో పాటు బ్యాంకు నుంచి పొందిన రుణాలను రికవరీ చేస్తామన్నారు. ఈ నిధుల కుంభకోణంలో మెప్మా, మున్సిపల్ అధికారుల కుంభకోణంపై పూర్తిగా విచారించి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట మెప్మా సీఎంఎంలు నాగేంద్ర, సుబ్రహ్మణ్యం, విజయ, సీఓలు భవిత, సుగుణ, తదితరులున్నారు. ఈ సందర్భంగా 21వ వార్డు లోని పలువురు డ్వాక్రా గ్రూపు మహిళలు పీడీ వెంకట నారాయణను కలిసి తమ సమస్యలను తెలియజేశారు.

సేవాతత్పరుడు డాక్టర్ ప్రకాశరావు కన్నుమూత

అవయవదానం చేయడంతో గుంటూరు జీజీహెచ్‌కు భౌతికదేహం అప్పగింత



డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు (ఫైల్)

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రముఖ వైద్యుడు వేజళ్ల ప్రకాశరావు(83) శనివారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, కుమారులు డాక్టర్ రామకృష్ణ, శివకృష్ణలు ఉన్నారు. రేపల్లె మండలం వేజళ్లవారిలంక గ్రామానికి చెందిన ప్రకాశరావు పట్టణంలోని ఎస్‌వీఎస్‌పి నర్సింగ్ హోమ్ నెలకొల్పి సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు వైద్యసేవలు అందించి పలువురి మన్ననలు పొందారు. పేదవారికి అధిక ప్రాధాన్యం కల్పిస్తూ ఆయన వైద్యసేవలు అందించారు. డాక్టర్‌గా సేవలు అందించటంతో పాటు 1998 సంవత్సరంలో పలువురు దాతలు, స్నేహితులు, అధికారులను కలుపు కొని రేపల్లెలో పవర్‌క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్రమేణ పవర్‌క్లబ్‌ను మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌గా మార్పు చేసి తీర ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అనేక మంది మనన్నలను పొందారు. ఎంసీఏ సభ్యుల సహకారంతో విద్య, వైద్యం, క్రీడా, సాంస్కృతిక రంగాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తూ, పేద మహిళలకు చేయూతనిచ్చారు. వరదలు, కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ఎంసీఏ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. పుష్కరాలలోనూ స్పెషల్ మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలలో నష్టపోయిన బాధితులకు ఆర్థికసాయం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి దాతృత్వం చాటుకున్నారు. తీరంలోని ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి తర్ఫీదునిచ్చారు. ఎంసీఏలో తర్ఫీదు పొందిన పలువురు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనపరుస్తున్నారు. తానా, బసవతారకం క్యాన్స ర్ ఇనిస్టిట్యూట్, పలు వురు దాతల సహకారంతో పలు సందర్భాలలో మెగా క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరాలు, సాధారణ వైద్యశిబిరాలు నిర్వహించారు.

పలువురి నివాళి..

పట్టణ, పరిసర గ్రామాలలో వైద్యవృత్తితో పాటు సేవా కార్యక్రమాలలో సేవలు అందించిన డాక్టర్ ప్రకాశరావు మృతిపట్ల పలువురు నివాళులర్పించారు. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు, ఇండియన్ మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌లతో పాటు లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, పట్టణానికి చెందిన పలువురు వైద్యులు ప్రకాశరావు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

గుంటూరు జీజీహెచ్‌కు అప్పగింత..

తన మరణానంతరం తన శరీరం, అవయవాలు పరిశోధనలకు ఉపయోగపడాలన్న డాక్టర్ ప్రకాశరావు కోరిక మేరకు ఆయన కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేశారు.

పోలీసుల అదుపులో నకిలీ నక్సలైట్లు!

- ఓ డాక్టర్‌ను బెదిరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వైనం
- రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం

బాపట్లటౌన్: నక్సలైట్ల ముసుగులో బడాబాబులను టార్గెట్‌గా చేసుకొని దందాలకు పాల్పడుతున్న ఓ దోపిడీ ముఠాను జిల్లా పోలీసులు శనివారం రాత్రి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నలుగురు వ్యక్తులు ఓ గ్యాంగ్‌గా ఏర్పడి నక్సలైట్లమని బెదిరిస్తూ ఇటీవల పలు ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడ్డారు. వీరి కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టిన జిల్లా పోలీస్ యంత్రాంగం గత కొన్ని రోజులుగా వీరిని అదుపులోకి తీసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం జిల్లాలోని రేపల్లె నియోజకవర్గం పరిధిలోని చెరుకుపల్లి మండలంలో ప్రముఖ వైద్యుడిని బెదిరించి భారీ మొత్తంలో నగదు డిమాండ్ చేస్తుండగా అప్పటికే వీరి కదలికలపై నిఘా పెట్టిన జిల్లా పోలీసులు వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. గ్యాంగ్‌లో మొత్తం నలుగురు వ్యక్తులు ఉండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. వీరు పాల్పడిన నేరాలకు సంబంధించిన పూర్తి సమాచారం రాబట్టేందుకు వీరిని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం.

ఏరియా వైద్యశాలలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యంతోనే అంటూ ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు



నాగలక్ష్మి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

యర్రగొండపాలెం: స్థానిక ఏరియా వైద్యశాలలో బాలింత మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ ఆమె బంధువులు శనివారం వైద్యశాల ఎదుట హైవేపై రాస్తారోకో చేశారు. పల్నాడు జిల్లా సిరిగిరిపాడు మండలంలోని దావుపల్లికి చెందిన నాగలక్ష్మి కాన్పు కోసం శుక్రవారం వైద్యశాలలో చేరింది. రాత్రి ఆమెకు గైనకాలజిస్ట్ ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. శిశువు పరిస్థితి బాగాలేకపోవడం వలన మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. నాగలక్ష్మిని వైద్యశాలలోనే ఉంచి వైద్యం చేస్తున్నారు. రాత్రికి ఆమె లోబీపీకి గురై మృతి చెందింది. ఈ విషయాన్ని వైద్యులు వెంటనే తమకు తెలియచేయలేదని, కేవలం డాక్టర్ నిర్లక్ష్యంతోనే నాగలక్ష్మి మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపించారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వైద్యశాల ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. సీఐ కె.మారుతీకృష్ణ, పుల్లలచెరువు ఎస్‌ఐ శ్రీహరి సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమించుకోవాలని కోరినప్పటికీ శాంతింలేదు. ఒక సందర్భంలో వారు వైద్యశాలపైకి దాడి చేసేందుకు యత్నించారు. వైద్యశాల సూరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాన్పుఅయిన తరువాత నాగలక్ష్మి ఆరోగ్యం బాగానే ఉందని, కాన్పు చేసిన వైద్యురాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారని, అనుకోకుండా ఆమె లోబీపీకి గురై మృతి చెందిందని తెలిపారు. డాక్టర్ల నిర్లక్ష్యం ఏమాత్రంలేదని స్పష్టం చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి



మృతి చెందిన తరుణ్

యద్దనపూడి: చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈఘటన మండలంలోని యనమదల వాగు వద్ద శనివారం జరిగింది. ఎస్‌ఐ అనూక్ వివరాల మేరకు.. యనమదల గ్రామం వడ్డెర కాలనీకి చెందిన తన్నీరు తరుణ్ (22) శనివారం గ్రామ సమీపంలోని వాగు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో వాగు వద్ద ఉన్న కరెంట్ స్తంభం నుంచి తీగ ద్వారా వాగులో పెట్టి చేపలు పట్టడానికి ప్రయత్నం చేశాడు. ఇదే సమయంలో తరుణ్ విద్యుదాఘాతానికి గురవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి మూడు నెలల క్రితమే వివాహం అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామ వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.